మొక్కలు నాటి సంరక్షించాలి



మొక్క నాటుతున్న సంక్షేమ సంఘం నాయకులు

కుత్బుల్లాపూర్ : వివేకానంద నగర్ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో సోమవారం పోచమ్మ –ఎల్లమ్మ ఆలయ సమీపంలో మొక్కలు నాటారు. ప్రతి ఒక్కరూ మొక్కలు నాటి వాటిని సంరక్షించాలని సూచించారు. ఆలయ కమిటీ చైర్మన్ కూన జగన్ గౌడ్, కాలనీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు సత్యం, సంతోష్, పత్తి సతీష్, అశోక్, యాదగిరి తదితరులు పాల్గొన్నారు.

30 సంవత్సరాలుగా ఏకగ్రీవం



నూతనంగా ఎన్నికైన సంక్షేమ సంఘం కార్యవర్గం

కుత్బుల్లాపూర్ : జీడిమెట్ల డివిజన్ మర్రి నారాయణరెడ్డి నగర్ సంక్షేమ సంఘం ఎన్నిక సోమవారం జరిగింది. కాలనీలోని సంక్షేమ సంఘం భవనంలో జనరల్ బాడీ సమావేశంలో ఏకగ్రీవంగా సంధి గోవర్ధన్ రెడ్డిని అధ్యక్షుడిగా ఎన్నుకున్నారు. 1995 నుంచి నేటి వరకు 30 సంవత్సరాల పాటు ఏకగ్రీవంగా ఎన్నికవుతూ వస్తున్నారు. కాలనీ అభివృద్ధి కోసం ప్రజాప్రతినిధులు, అధికారుల చుట్టూ తిరుగుతూ కాలనీలో రోడ్లు, డ్రైనేజీ, మంచి నీటి వసతి వంటి సమస్యలను తీర్చడంలో గోవర్ధన్ రెడ్డి తనదైన ముద్ర వేసుకున్నారు. ఈ నేపథ్యంలో ఏకగ్రీవంగా ఎన్నుకుంటూ తీర్మానం చేశారు. ప్రధాన కార్యదర్శిగా పి శంకర్, కోశాధికారిగా జి భరత్, కార్యవర్గ సభ్యులుగా కిరణ్ కుమార్, శ్రీనివాస్, హరికృష్ణ, ప్రసాద్‌లను ఎన్నుకున్నారు.

దాడికి నిరసనగా కాంట్రాక్టర్ల నిరసన



నిరసనలో పాల్గొన్న కాంట్రాక్టర్లు

జగద్గిరిగుట్ట : చార్మినార్ జోన్‌లో కాంట్రాక్టర్ మహ్మద్ ఇసాక్‌పై జరిగిన దాడికి నిరసనగా జీహెచ్‌ఎంసీ పరిధిలోని అన్ని సర్కిళ్లలో ఒకరోజు నిరసన కార్యక్రమం నిర్వహించారు. సోమవారం గాజులరామారం, కుత్బుల్లాపూర్‌లో పనులు నిలిపివేసి నిరసన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో జంట సర్కిళ్ల కాంట్రాక్టర్స్ అసోసియేషన్ అధ్యక్షులు రేపన్ గిరిబాబు, ఉపాధ్యక్షులు నరేష్, వర్కింగ్ ప్రెసిడెంట్ సాయిబాబా, బొంత ఎల్లయ్య, రంగరాజు, రమేష్, అశోక్, దుర్గయ్య పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారానికి కృషి



కూన శ్రీశైలంగౌడ్‌కు వినతి పత్రం అందజేస్తున్న కాలనీ వాసులు

కుత్బుల్లాపూర్: స్థానిక సమస్యలను పరిష్కరించేందుకు తన వంతు కృషి చేస్తానని మాజీ ఎమ్మెల్యే కూన శ్రీశైలంగౌడ్ అన్నారు. షాపూర్ నగర్‌లోని ఆయన నివాసంలో పలువురు ఆయనను కలిసి సమస్యలు వివరించారు. అదే విధంగా ఆహ్వాన పత్రికలను అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రజా సంక్షేమం కోసమే కాంగ్రెస్ ప్రభుత్వం పని చేస్తుందన్నారు.

పాఠశాలకు వాటర్ మోటారు అందజేత



వాటర్ మోటార్‌ను అందజేస్తున్న హైత్వి

చింతల్: రంగారెడ్డి నగర్‌కు చెందిన ఆలేటి సురేష్ గౌడ్– సౌమ్యల కూతురు హైత్వి జన్మదిన వేడుకలను సోమవారం ప్రాథమిక పాఠశాలలో ఘనంగా నిర్వహించారు. హైత్వి దాచుకున్న పాకెట్ మనీ రూ.5 వేలతో వాటర్ మోటార్‌ను పాఠశాల హెచ్‌ఎం కల్పనకు అందజేశారు. కార్యక్రమంలో యాదిరెడ్డి, సుధాకర్, సురేష్ గౌడ్, పాఠశాల సిబ్బంది పాల్గొన్నారు.

పాతాళానికి పానీ..!

మేడ్చల్–మల్కాజిగిరి జిల్లాలో అడుగంటుతున్న భూగర్భ జలాలు



నీటి మట్టాన్ని లెక్కిస్తున్న భూగర్భజల వనరుల శాఖ ఉద్యోగులు

- జనవరిలో సగటున 1.83 మీటర్ల లోతుకు పడిపోయిన వైనం
- అత్యధికంగా ఉప్పల్‌లో 5.35 మీటర్ల డౌన్
- నీటి పొదుపునకు ప్రజల్లో అవగాహనపై చర్యలు
- గతేడాది జనవరితో పోల్చితే 13 మండలాల్లో తగ్గుముఖం
- ఘట్‌కేసర్, ఎంసీపల్లిలో నిలకడగా జలమట్టం

సాక్షి,సిటీబ్యూరో: మేడ్చల్–మల్కాజిగిరి జిల్లాలో భూగర్భ జలాలు అడుగంటిపోతున్నాయి. గతేడాది జనవరితో పోల్చుకుంటే, ఈఏడాది జనవరిలో సగటున 1.83 మీటర్ల లోతుకు పడిపోయింది. జిల్లాలోని 13 మండలాల్లో నీటి మట్టం కూడా గణనీయంగా తగ్గుముఖం పట్టింది. ముదురుతున్న ఎండల నేపథ్యంలో జిల్లా భూగర్భ జల శాఖ నీటిని పొదుపుగా వాడుకోవాలని అవగాహనకు కార్యక్రమాలకు సన్నద్ధమవుతోంది. రానున్న 4 నెలల్లో ఎండలు మరింత తీవ్రం కానుండడంతో నీటి పొదుపు చాలా అవసరమని పేర్కొంటోంది. వర్షపు నీరు వృథాగా పోకుండా..ఇంటి ఆవరణలోనే ఇంకించుకునేలా ఇంకుడు గుంతలు నిర్మించుకోవాలని జిల్లా భూగర్భ జల శాఖ సూచిస్తున్నది. రైతులు కూడా పొలాల్లో నీటి కుంటలు ఏర్పాటు చేసుకోవాలని కోరుతోంది. అలాగే ఆరుతడి పంటల మార్పిడికి సిద్ధం కావాలని పేర్కొంటోంది. ఎండిపోయిన బోరుబావులను రీచార్జి చేసుకునేలా అవశ్యకతపై దృష్టి సారించాల్సి అవసరముందంటోంది.

13 మండలాల్లో తగ్గిన జలం..

మేడ్చల్–మల్కాజిగిరి జిల్లాలో గతేడాది జనవరితో పోల్చుకుంటే జిల్లాలో సగటున 1.83 మీటర్ల లోతుకు జలమట్టం పడిపోయింది. మండలాల వారీగా పరిశీలిస్తే 13 మండలాల్లో లోతుకు పడిపోగా, మిగతా 2 మండలాల్లో నిలకడగా నీటి మట్టం ఉన్నట్లు భూగర్భజల శాఖ రికార్డులు పేర్కొంటున్నాయి. కూకట్‌పపల్లి మండలంలో అత్యధికంగా 18.79 మీటర్ల లోతుకు భూగర్భ జల మట్టం పడిపోయింది. తర్వాత స్థానంలో మల్కాజిగిరి, ఉప్పల్, దుండిగల్, మేడిపల్లి, మేడ్చల్, కుత్బుల్లాపూర్, బాలానగర్, శామీర్‌పేట, కాప్రా, మేడిపల్లి, కీసర, బాచుపల్లి మండలాలు ఉన్నాయి. జిల్లాలోని 13 మండలాల ప్రజలు నీటిని పొదుపుగా వాడుకోవాలని జిల్లా భూగర్భజల శాఖ కోరుతున్నది. మరో 2 మండలాల్లో మాత్రం భూగర్భ జలమట్టం నిలకడగా ఉంది. ఎంసీపల్లిలో మండలంలో గతేడాది (2024)జనవరితో పోల్చితే ఈ ఏడాది (2025) జనవరిలో 0.73 మీటర్ల భూగర్భ జలమట్టం పెరిగింది. అలాగే, ఘట్‌కేసర్ మండలంలో 0.45 మీటర్ల జలమట్టం పెరిగింది. అయినప్పటికీ ముదురుతున్న ఎండలను దృష్టిలో పెట్టుకుని నీటి పొదుపును పాటించాలని భూగర్భజల శాఖ జిల్లా ప్రజలను కోరుతోంది.

మేడ్చల్ జిల్లాలోని 15 మండలాల్లో గతేడాదితో పోల్చుకుంటే భూగర్భ జలాల పరిస్థితి

మండలం	జనవరి 2024	జనవరి 2025	తేడా
అల్వాల్	9.33	9.53	0.20
బాచుపల్లి	4.49	6.85	2.36
బాలానగర్	8.01	8.80	0.80
దుండిగల్	12.75	14.93	2.18
ఘట్కేసర్	7.01	6.57	0.45
కాప్రా	4.17	5.11	0.94
కీసర	7.57	9.45	1.88
కూకట్‌పల్లి	11.95	18.79	6.84
ఎంసీపల్లి	16.34	15.61	0.73
మల్కాజిగిరి	15.69	17.60	1.91
మేడ్చల్	7.94	11.20	3.26
మేడిపల్లి	13.00	13.93	0.94
కుత్బుల్లాపూర్	7.37	10.68	3.31
శామీర్‌పేట్	5.00	6.49	1.49
ఉప్పల్	6.29	11.65	5.35
జిల్లా సగటు	9.38	11.21	1.83

పశువుల సంత వద్దు.. స్టేడియం ముద్దు



సంతకాల సేకరణ నిర్వహిస్తున్న అఖిలపక్ష నాయకులు

మోతీనగర్: 'పశువుల సంత వద్దు..స్టేడియం ముద్దు' అని మోతీనగర్ చౌరస్తాలో అఖిలపక్ష నాయకులు సోమవారం సంతకాల సేకరణకు శ్రీకారం చుట్టారు. మూసాపేట డివిజన్, బబ్బుగూడలో ఉన్న పశువుల సంతను వేరే ప్రాంతానికి తరలించి ఆ స్థలంలో స్టేడియాన్ని నిర్మించాలని వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు, ఎమ్మెల్యే కృష్ణారావులకు అఖిలపక్షం నాయకులు వినతిపత్రం అందజేశారు. ఎంతో కాలంగా బబ్బుగూడ సంతను తరలించాలని డిమాండ్ చేస్తున్నా పట్టించుకోవడం లేదన్నారు. పశువుల సంతలో శని, ఆదివారాల్లో తప్ప మిగిలిన సమయాల్లో అసాంఘిక కార్యకలాపాలకు అడ్డాగా మారిందన్నారు. పశువుల సంతను తరలించి స్టేడియం నిర్మించే వరకు వివిధ దశలో ఉద్యమం చేపడతామని తెలిపారు. కార్యక్రమంలో కడపాన గోపాల్ రెడ్డి, నాగుల సత్యం గంగపుత్ర, ఉదయ్ కుమార్, బసవరాజ్, జబ్బర్ఖాన్, శ్రీనివాస్ గౌడ్, లక్ష్మీ నారాయణ, రాజు చారి, ధర్మేందర్, చిట్టబోయిన దినేష్ కుమార్, వెంకట్‌రెడ్డి, పోతురాజు, శివ, నీరజ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

సమస్యలు లేని డివిజన్‌గా తీర్చిదిద్దుతా

జగద్గిరిగుట్ట : డివిజన్ అభివృద్ధే తన లక్ష్యమని కార్పొరేటర్ కొలుకుల జగన్ అన్నారు. సోమవారం డివిజన్ పరిధిలోని అంజయ్య నగర్‌లో రూ.60 లక్షలతో సీసీ రోడ్డు పనులకు శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సమస్యలు లేని డివిజన్‌గా తీర్చిదిద్దడమే తన ముందున్న లక్ష్యమని అన్నారు. పనుల్లో నాణ్యత పాటించాలని కాంట్రాక్టర్లకు సూచించారు. కార్యక్రమంలో డివిజన్ అధ్యక్షులు రుద్ర అశోక్, సీనియర్ నాయకులు జైహింద్, వెంకట్ రెడ్డి, బుచ్చిరెడ్డి, దత్తాత్రేయ, అంజయ్య నగర్ సొసైటీ అధ్యక్షులు శంకర్ గుప్తా, ప్రధాన కార్యదర్శి గణేష్, నాయకులు విట్టల్ ముదిరాజ్, మహేందర్ రెడ్డి, నాగరాజు, నాని, జై క్రిష్ణ, యాదగిరి, మనోజ్, రాజు, సాయిలు, ఆజం, విఘ్నేష్, రాజు తదితరులు పాల్గొన్నారు.

ప్రజావాణిలో 3 ఫిర్యాదులు

జగద్గిరిగుట్ట : కుత్బుల్లాపూర్ జలమండలి కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజావాణిలో 3 ఫిర్యాదులు వచ్చాయి.

- గాజుల రామారం సెక్షన్ వీనస్ ఎన్‌క్లేవ్‌లో నీటి సమస్య తీవ్రంగా ఉందని, వీలైనంత తొందరగా సమస్యకు పరిష్కారం చూపాలని ఆ కాలనీకి చెందిన ప్రతాప్ రెడ్డి ఫిర్యాదు చేశారు.
- సూరారం సెక్షన్ రామలీల మైదాన్ సమీపంలో భూగర్భ డ్రైనేజీ పాత పైపులైన్‌తో నిత్యం పొంగి పొర్లుతుందని, కొత్త పైపులైన్ వేయాలని శ్రీకాంత్ ఫిర్యాదు చేశారు.
- చింతల్, పద్మానగర్ కాలనీ ఫేజ్ 1 అసోసియేషన్ సభ్యులు నీటి సమస్యపై పలు మార్లు విన్నవించినా అధికారులు పట్టించుకోవడం లేదని సభ్యులు వివరించారు. వారం రోజుల్లో పర్యటించి నీటి సమస్యకు పరిష్కారం చూపుతామని డీజీఎం రాజేష్ హామీ ఇచ్చారు.

ముగిసిన దుండిగల్ ప్రీమియర్ లీగ్ క్రికెట్



విజేతకు ట్రోఫీని అందజేస్తున్న మర్రి లక్ష్మణ్‌రెడ్డి

దుండిగల్: దుండిగల్ ప్రీమియర్ లీగ్ క్రికెట్ పోటీలు సోమవారం ముగిశాయి. మూడు వారాల పాటు జరిగిన ఈ పోటీల్లో మొత్తం 10 జట్లు తలపడ్డాయి. ఫైనల్స్‌లో శ్రీ కృష్ సేన టీంపై వైల్డ్ ఈగల్స్ జట్టు విజయం సాధించింది. ఎంఎల్ఆర్ఐటీ విద్యా సంస్థల అధినేత మర్రి లక్ష్మణ్‌రెడ్డి ముఖ్య అతిథిగా హాజరై విజేత జట్టుకు ట్రోఫీతో పాటు రూ.10 వేలు, రన్నరప్ జట్టుకు రూ.6 వేలు, ట్రోఫీని అందజేశారు. కార్యక్రమంలో సర్పంచ్‌ల ఫోరం మాజీ మండల అధ్యక్షుడు గణేష్, మాజీ కౌన్సిలర్ అమరం గోపాల్ రెడ్డి, పీఏసీఎస్ డైరెక్టర్ నల్తూరి కృష్ణ, నాయకులు జక్కుల శ్రీనివాస్ యాదవ్, ఆకుల ప్రేమకుమార్, దొంతి మహేశ్, మల్లిపెద్ది నాగరాజు, తక్కెడ రమేష్ తదితరులు పాల్గొన్నారు.



ఎక్సైజ్ సీఐ వేణుకుమార్‌కు సమస్యలతో కూడిన వినతిపత్రం అందజేస్తున్న తెలంగాణ బార్ అండ్ రెస్టారెంట్ ఓనర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు జి.దామోదర్ గౌడ్ తదితరులు - బాలానగర్

యువతకు ఉపాధి కల్పనే ప్రభుత్వ లక్ష్యం



కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానిస్తున్న శేరి సతీష్ రెడ్డి

కూకట్‌పల్లి: యువతకు ఉపాధి కల్పించడమే ప్రభుత్వ లక్ష్యమని, ఇప్పటికే ప్రభుత్వం నోటిఫికేషన్‌లు వేసి నిరుద్యోగులకు ఉద్యోగ అవకాశాలు కల్పించిందని కాంగ్రెస్ నియోజకవర్గ మాజీ అధ్యక్షుడు శేరి సతీష్‌రెడ్డి అన్నారు. ఎస్ఎస్ఆర్ కార్యాలయంలో పలువురు కాంగ్రెస్ పార్టీలో చేరారు. వారికి పార్టీ కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. విదేశీ కంపెనీలు రాష్ట్రంలో ఏర్పాటు చేయటం వల్ల యువతకు ఉపాధి రంగాల్లో అవకాశాలు మెండుగా ఉంటాయన్నారు. కాంగ్రెస్ పార్టీలో చేరిన యువతకు సముచిత స్థానం ఉంటుందని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో జీఆర్‌పి నాయక్,సాయి,గణేష్,లోకేష్, అరవింద్, అశోక్, వెంకీ, దినేష్, సందీప్ తదితరులు పాల్గొన్నారు.

బీఆర్ఎస్ ఫ్లెక్సీలను ఎలా తొలగిస్తారు?

అధికారులపై ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు ఆగ్రహం



కూకట్‌పల్లి: తెలంగాణ తొలి సీఎం కేసీఆర్ పుట్టిన రోజు సందర్భంగా ఏర్పాటు చేసిన ఫ్లెక్సీలను ఎలా తొలగిస్తారని ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు అధికారులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. నియోజకవర్గంలో బీఆర్ఎస్ కార్యకర్తలు, నాయకులు ఏర్పాటు చేసిన ఫ్లెక్సీలను అనుమతులు లేవని జీహెచ్ఎంసీ అధికారులు తొలగించారు. దీంతో సోమవారం ఆయన అధికారులతో ఫోన్‌లో మాట్లాడి విలేకరుల సమావేశంలో మాట్లాడారు. 14 నెలలుగా గల్లీల్లో, రహదారులలో ఎక్కడ చూసినా కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు ఫ్లెక్సీలు ఏర్పాటు చేశారని, అప్పుడు అధికారులు ఏం చేశారని ప్రశ్నించారు. ప్రభుత్వమే ఫ్లెక్సీలను తొలగించాలని ఆదేశమివ్వడం సిగ్గుచేటన్నారు. కాంగ్రెస్, బీజేపీ పార్టీలు ఏర్పాటు చేసిన వాటిని ఎక్కడా తొలగించకుండా కేవలం బీఆర్ఎస్ పార్టీనే టార్గెట్ చేయడం సరికాదన్నారు. అధికారులు తమ తీరును మార్చుకోవాలని సూచించారు.

శాస్త్రోక్తంగా పెంపుడు కుక్కకు అంత్యక్రియలు

మూసాపేట: పెంపుడు కుక్క చనిపోవటంతో ఆ కుటుంబం తల్లడిల్లిపోయింది. శాస్త్రోక్తంగా దహన సంస్కారాలు నిర్వహించారు. మూసాపేట, ఆంజనేయ నగర్ కాలనీలో సోమ ప్రభాకర్, మాధవి దంపతులు నివసిస్తున్నారు. వీరు 14 సంవత్సరాల క్రితం జర్మన్ షెఫర్డ్ కుక్కను తెచ్చుకొని పెంచుకుంటున్నారు. వయసు మీద పడటంతో సోమవారం చనిపోయింది. మూసాపేటలోని హిందూ శ్మశాన వాటికలో సాంప్రదాయం ప్రకారం అంత్యక్రియలు నిర్వహించారు. ఐదు రోజులు, పెద్ద కర్మ కూడా నిర్వహిస్తానని ఆయన తెలిపారు.





దహన సంస్కారాలు నిర్వహిస్తున్న కుటుంబ సభ్యులు

అక్రమ నిర్మాణాలు సీజ్

కూకట్‌పల్లి: అనుమతులు లేని నిర్మాణాలను సోమవారం జీహెచ్ఎంసీ టౌన్‌ప్లానింగ్ అధికారులు సీజ్ చేసి హెచ్చరిక బోర్డులను ఏర్పాటు చేశారు. ప్రభుత్వ అనుమతుల ప్రకారం భవన నిర్మాణాలు చేపట్టాలని, అక్రమంగా నిర్మాణం చేపడితే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని అధికారులు హెచ్చరించారు. బాలానగర్, భరత్‌నగర్ కాలనీలో, కైత్లాపూర్ మెయిన్ రోడ్డులో పలు వాణిజ్య, నివాస భవనాలను సీజ్ చేసినట్లు తెలిపారు.



అక్రమ నిర్మాణాలను సీజ్ చేసిన టౌన్‌ప్లానింగ్ అధికారులు

ప్రజల సౌకర్యార్థమే బస్సు సౌకర్యం

ఎమ్మెల్యే వివేకానంద్

దుండిగల్: ప్రజల సౌకర్యార్థమే నూతన బస్సు సౌకర్యం ప్రారంభించామని బీఆర్ఎస్ శాసనసభ విప్, ఎమ్మెల్యే వివేకానంద్ అన్నారు. దుండిగల్‌లోని డబుల్ బెడ్ రూమ్ ఇళ్ల సముదాయాల నుంచి నగరంలోని సికింద్రాబాద్ వరకు నూతనంగా ఏర్పాటు చేసిన బస్ సర్వీస్‌ను సోమవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. డబుల్ బెడ్ రూమ్ ఇళ్లల్లో నివసించే నిరుపేదలకు అన్ని రకాల మౌలిక వసతులు కల్పించామని గుర్తు చేశారు. అదేవిధంగా నగరంలోని వివిధ ప్రాంతాలకు వెళ్లడానికి ఆర్టీసీ బస్సులను ఏర్పాటు చేస్తున్నామని తెలిపారు. ఇప్పటికే డి పోచంపల్లి డబుల్ బెడ్ రూమ్ ఇళ్లకు గతంలోనే బస్సు సౌకర్యం కల్పించామన్నారు. కార్యక్రమంలో బౌరంపేట్ పీఏసీఎస్ చైర్మన్ మిద్దెల బాల్‌రెడ్డి, మాజీ కౌన్సిలర్లు జక్కుల కృష్ణ యాదవ్, జక్కుల శ్రీనివాస్ యాదవ్, నర్సారెడ్డి శ్రీనివాస్ రెడ్డి, మురళి యాదవ్, విష్ణువర్ధన్ రెడ్డి, గ్రంథాలయ సంస్థ జిల్లా మాజీ చైర్మన్ నాగరాజు యాదవ్, మేడ్చల్ మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ రవి యాదవ్ తదితరులు పాల్గొన్నారు.



ఆర్టీసీ బస్సులో ప్రయాణిస్తున్న ఎమ్మెల్యే వివేకానంద్ తదితరులు

నోటీసులు జారీ

జగద్గిరిగుట్ట : హైడ్రా ఆదేశాల మేరకు జగద్గిరిగుట్ట కొండపై సంఘాల పేర నిర్మాణాలకు, ఇతర ఆలయాల పేర ప్రహరీ నిర్మాణం చేపట్టినవారికి రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ గులామ్ ఖలీం ఆధ్వర్యంలో సోమవారం నోటీసులు జారీ చేశారు. ఈ నెల 24వ తేదీ లోగా సరైన పత్రాలు చూపాలని ఆదేశించారు. కొండపై ఉన్న కురుమ సంఘం, గౌడ సంఘం, యాదవ సంఘం, రెడ్డి సంఘం, వైశ్య సంఘం, శనీశ్వర, సమ్మక్క సారలమ్మ, తుల్జా భవానీ ఆలయాలు, మానికేశ్వరిమాత, మార్కండేయ ఆలయ ప్రహరీ నిర్మాణాలపై, గోశాల నిర్మాణం, ఇంకా అక్రమంగా వెలిసిన వాటికి నోటీసులు జారీ చేశారు.

ప్రజావాణికి 16 ఫిర్యాదులు

కూకట్‌పల్లి: కూకట్‌పల్లి జోనల్ కార్యాలయంలో ప్రజావాణి సోమవారం నిర్వహించిన ప్రజావాణికి 16 ఫిర్యాదులు అందాయి. వివిధ విభాగాలకు చెందిన అధికారులు దరఖాస్తులు స్వీకరించారు. టౌన్ ప్లానింగ్ 9, ఇంజినీరింగ్ 2, ఎలక్ట్రికల్ 2, పార్కులు 2, డీపీఓ 1 మొత్తం 16 సమస్యలపై ప్రజలు అధికారులకు వినతిపత్రాలు అందజేశారు. ప్రజావాణి ద్వారా వచ్చిన ఫిర్యాదులను దశల వారీగా పరిష్కరిస్తామని అధికారులు తెలిపారు.



ఫిర్యాదులు స్వీకరిస్తున్న అధికారులు

ఘనంగా కేసీఆర్ జన్మదిన వేడుకలు

కూకట్‌పల్లి(జోన్‌బృందం): తెలంగాణ తొలి సీఎం, బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ జన్మదిన వేడుకలను నియోజకవర్గ వ్యాప్తంగా సోమవారం ఘనంగా నిర్వహించారు. ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు, ఎమ్మెల్సీ నవీన్‌కుమార్, బీఆర్ఎస్ కార్పొరేటర్‌లు, పార్టీ నాయకులు, కార్యకర్తలు వివిధ కార్యక్రమాలు నిర్వహించారు. దేవాలయాల్లో కేసీఆర్ పేరు మీద అర్చనలు, ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం మొక్కలు నాటి, ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు పుస్తకాలను పంపిణీ చేశారు. ఓల్డ్‌బోయిన్‌పల్లి కార్పొరేటర్ ముద్దం నరసింహ యాదవ్ ఆధ్వర్యంలో వేడుకలు నిర్వహించారు. మొక్కలు నాటి, రెండు వేల మంది మహిళలకు చీరలు పంపిణీ చేశారు.



రిక్షా పుల్లర్స్ కాలనీలో పుస్తకాలు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే కృష్ణారావు, ఎమ్మెల్సీ నవీన్‌కుమార్, కార్పొరేటర్ రోజాదేవి



పర్వత్‌నగర్ ప్రభుత్వ పాఠశాలలో కార్పొరేటర్ సబిహా బేగం తదితరులు



బీఆర్ఎస్ ఫతేనగర్ కార్యాలయంలో.. కార్పొరేటర్ పండాల సతీష్ గౌడ్ తదితరులు



ఓల్డ్‌బోయిన్‌పల్లిలో చీరల పంపిణీలో పాల్గొన్న మహిళలు